సాక్షి
వికారాబాద్

శనివారం । 14 । అక్టోబర్ । 2023

నిలిచేదెవరు? గెలిచేదెవరు?
జిల్లా రాజకీయాలు ఈ సారి రసవత్తరంగా మారబోతున్నాయి. పరిగి నియోజకవర్గంపై అన్ని పార్టీలు ఫోకస్ పెట్టాయి. 2లో▸



రాష్ట్రాన్ని దోచిన ప్రభుత్వం
తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను నిలువునా దోపిడీ చేసిందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. 3లో▸



రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు
వికారాబాద్‌లో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి బ్రహ్మోత్స వాలు ప్రారంభంకానున్నాయి. 3లో▸

నగదు నొక్కేస్తున్నారా?

- పట్టుబడిన డబ్బు.. పోలీసులు చూపుతున్న లెక్కల్లో వ్యత్యాసం
- వికారాబాద్‌లో వైరల్ అవుతున్న వీడియో
- రూ.10 లక్షలు పట్టుబడితే రూ. 9.5 లక్షలే చూపించారు
- పరిగిలోనూ ఇలాంటి సంఘటనే..



వికారాబాద్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

వికారాబాద్: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే వదిలేస్తున్నారు. ఈ నేపథ్యంలో పలు చోట్ల రూ.లక్షల్లో నగదు పట్టుబడుతోంది. యాభై వేలకు మించి తీసుకెళ్లాలంటే ఎందుకు, ఎక్కడికి, ఏ అవసరం మీద తరలిస్తున్నారో చెప్పాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. చాలా మంది తెలిసో తెలియకో.. తప్పించుకోలేమా.. అనే అతి విశ్వాసంతో భారీగా నగదు తరలిస్తూ పోలీసులకు చిక్కుతున్నారు. అయితే పట్టుబడి డబ్బులకు సంబంధించి లెక్కలు చూపించడంలో పారదర్శకత కనిపించడం లేదు. సీజ్ చేసిన డబ్బులో కొంత మొత్తం నొక్కేసి మిగతాది లెక్క చూపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల వికారాబాద్‌లో నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన డబ్బుల్లో కొంత నగదు నొక్కేశారనే వీడియో వైరల్‌గా మారింది. వికారాబాద్ తనిఖీల్లో కారులో తరలిస్తున్న రూ.10 లక్షలు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డబ్బు లెక్కిస్తుండగా వీడియో చిత్రీకరించారు. ఆ వీడియోలో రూ.10 లక్షల నగదు ఉన్నట్లు కనిపించింది. అయితే అధికారులు మాత్రం రూ. 9.5 లక్షలు పట్టుబడినట్లు చూపించారు. నగదు లెక్కింపు వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇటీవల పరిగి మండలంలోని ఓ చెక్‌పోస్టు వద్ద కూడా ఇలాంటి సంఘటనే చోటు చేసుకుంది. రూ.50 వేలు తీసుకుని డబ్బులు సీజ్ చేయకుండా వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లక్ష్యం నెరవేరేనా?

ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా ఎన్నికలు నిర్వహించాలనే లక్ష్యంతో ఎన్నికల కమిషన్ నగదు, మద్యాన్ని కట్టడి చేసేందుకు చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తోంది. విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తోంది. అయితే కొంతమంది అధికారులు చేస్తున్న పనుల వల్ల అందరికీ చెడ్డ పేరు వస్తోంది. ఇదిలా ఉండగా ఎన్నికల కోసం తరలిస్తున్న డబ్బు పట్టుబడిన దాఖలాలు కనిపించడం లేదు. వ్యక్తిగత, వ్యాపార అవసరాల కోసం తీసుకెళుతున్న డబ్బే పట్టుబడుతోంది. అయితే ఎన్నికలకు సంబంధించిన డబ్బు చేరాల్సిన చోటికి సురక్షితంగా చేరుతోందని పలువురు అంటున్నారు. అధికారులు నిఘాను మరింత పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్లాపూర్ వద్ద రూ.2.38 లక్షలు స్వాధీనం

తాండూరు రూరల్: మండలంలోని కొత్లాపూర్, అంతారం చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. కర్ణాటక నుంచి తెలంగాణకు డబ్బు, మద్యం రవాణా కాకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. తాండూరు మండలం మిట్టబాసుపల్లికి చెందిన శంకర్‌నాయక్ కర్ణాటక నుంచి బైక్‌పై వస్తుండగా కొత్లాపూర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేశారు. అతని వద్ద రూ. 2.38 లక్షలు ఉండడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. రూ.50 వేలకు మించి డబ్బు ఉంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు. తాండూరు మున్సిపల్ చైర్పర్సన్ స్వప్న పరిమళ్ వాహనాన్ని పట్టణ పోలీసులు తనిఖీ చేశారు. శుక్రవారం అంతారం వద్ద ఆమె వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.



అంతారం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

హస్తాన్ని భస్మం చేస్తాం

- కాంగ్రెస్ పార్టీపై ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫైర్
- 45 రోజులు నాకోసం పని చేయండి
- ఐదేళ్లు మీ కోసం పని చేస్తా
- యువతను కోరిన పైలెట్

తాండూరు: అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపాలని చూస్తే.. ఆ హస్తాన్ని భస్మం చేసి చూపిస్తానని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని ఏఆర్ గార్డెన్‌లో నియోజకవర్గంలోని యువకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు మరో 45 రోజుల సమయం ఉందని, యువత నా కోసం పని చేయాలని, తాను ఐదేళ్ల పాటు మీ కోసం పని చేస్తానని స్పష్టం చేశారు. యువత తలచుకుంటే సాధించలేనిదంటూ ఉండదన్నారు. ఎన్నికల్లో బంపర్ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారని అన్నారు. సీఎం చొరవతో నియోజకవర్గాన్ని వందల కోట్లతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. తెలంగాణ అభివృద్ధికి బీజేపీ అడ్డుపడుతోందని మండిపడ్డారు. తాండూరులో విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేశాన్నారు. 50 ఏళ్లుగా ఎవరూ చేయని అభివృద్ధిని తాను చేసి చూపించానన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సందల్ రాజుగౌడ్, నాయకులు కరణం పురుషోత్తం రావు, శ్రీశైల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

అండగా ఉండండి.. ఆశీర్వదించండి

- మంత్రి సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: ముఖ్యమంత్రిగా కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. ప్రజలకు మంచి చేసిన ప్రభుత్వానికి అండగా నిలబడాలని ఆమె కోరారు. శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సరూర్‌నగర్ డివిజన్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో కోట్లాది రూపాయల నిధులు తెచ్చి మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపినట్లు చెప్పారు. రానున్న కాలంలో మరింత అభివృద్ధి చేయడానికి అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. విద్యాశాఖ నుంచి రూ.100 కోట్లు వెచ్చించి మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి సైనికుల్లాంటి కార్యకర్తల బలం ఉందని, ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రతి గడపకూ బీఆర్ఎస్ సంక్షేమ కార్యక్రమాలు చేరాయని, వారందరినీ కలిసి మరింత మంచి కోసం బీఆర్ఎస్‌కు మద్దతు కోరాలన్నారు. ప్రజలకు, పార్టీకి మధ్య వారధులుగా పనిచేయాలన్నారు. ఇంటింటి ప్రచారం నిర్వహించి నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు అరవింద్ శర్మ, బేర బాలకిషన్, మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనిత, పార్టీ డివిజన్ అధ్యక్షుడు మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ధ్రువపత్రాల పరిశీలన



మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో పరిశీలించారు. మొత్తం 277 మంది అభ్యర్థులకు గాను 266 మంది సర్టిఫికెట్లతో వచ్చారు. ఈ నెల 16, 17 తేదీల్లో మెడికల్ టెస్ట్ ఉంటుందని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఎస్పీ కార్యాలయంలో ఉదయం నిర్వహించే మెడికల్ టెస్ట్‌కు రావాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఏఎస్పీలు రవీందర్‌రెడ్డి, మురళీధర్, ఏఆర్ డీఎస్పీ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ మేనిఫెస్టో విడుదల చేయాలి

సంఘం నాయకుడు రాజ్‌కుమార్



రాజ్‌కుమార్

తాండూరు టౌన్: రాబోయే ఎన్నికల్లో బీసీల డిమాండ్లతో కూడిన మేనిఫెస్టోను విడుదల చేయాలని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అన్ని పార్టీలు ఈ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు టికెట్లు కేటాయించాలన్నారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కేటాయించేలా, అధికారంలోకి వచ్చే ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. జనగణనతో పాటు కులగణన కూడా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అన్ని రంగాల్లో బీసీలు అట్టడుగున ఉన్నారని, వారి ఆర్థికాభివృద్ధికి బడ్జెట్‌లో సముచిత న్యాయం జరిగేలా చూడాలన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

అనంతగిరి: విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర నాయకులు శివరాజు, శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలలో 200 పాయింట్లకు 134 పాయింట్లతో దేశంలోని 748 జిల్లాలకు గాను 337వ స్థానంలో నిలవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. 6 అంశాలలో 600 పాయింట్లకు గాను 328 పాయింట్లతో దేశంలో 436 స్థానంలో నిలిచిందన్నారు. నాణ్యమైన విద్యను అందించకపోవడంతో తరతరాల వెనుకబాటుకు గురవుతారని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించే గ్యారంటీ ప్రభుత్వం చట్టబద్ధ బాధ్యతగా తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు వెంకటయ్య, నర్సింలు, వెంకటేష్, రాములు, దేవకుమారి, ఆశలతా, ఉమాదేవి , బిస్మిల్లా బేగం తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలించిందని..

యువకుడి బలవన్మరణం

తాండూరు రూరల్: జులాయిగా తిరుగుతున్నాడని తల్లి మందలించడంతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఘటన మండలంలోని నారాయణపూర్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీరేశం కథనం ప్రకారం.. తాండూరు మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన రాంచందర్ (27) పనికి వెళ్లకుండా ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. పనికి వెళ్లాలని తల్లి మందలించింది. దీంతో ఆ యువకుడు శుక్రవారం గ్రామ శివారులోని మంతట్టి–నారాయణపూర్ మధ్య రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని నారాయపూర్‌కు తరలించారు.

రైతులు సహకరించాలి

షాబాద్: రైతులు పంటల సాగు విషయంలో అధికారులకు సహకరించాలని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి అన్నారు. షాబాద్ క్లస్టర్‌లో రైతులు సాగు చేసిన పంటల నమోదును శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యవసాయ విస్తరణ అధికారులు సర్వే నంబర్ల వారీగా రైతులు సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేయాలని సూచించారు. దీంతో సాగు విస్తీర్ణం లెక్క సక్రమంగా తెలుస్తుందని, పంటల నమోదు ఆధారంగానే ప్రభుత్వం పంటలను కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం, ఏఈఓ రాజేశ్వరి, పలువురు రైతులు ఉన్నారు.

ఆశావహుల్లో ఉత్కంఠ

- కాంగ్రెస్ జాబితా సిద్ధమంటూ ప్రచారం
- తాండూరు టికెట్ కోసం డీసీసీబీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పోటీ
- రెండు గ్రూపులుగా విడిపోయి ప్రచారం

వికారాబాద్: జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న వారిలో ఉత్కంఠ నెలకొంది. వారి భవితవ్యం నేడో రేపో తేలిపోనుంది. అభ్యర్థుల తొలి జాబితాను ఒకటి రెండు రోజుల్లో ప్రకటిస్తామని పీసీసీ ప్రకటించడంతో నేతల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే బీఆర్ఎస్ నాలుగు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించడంతో వారు ప్రజల్లోకి వెళుతున్నారు. అయితే వికారాబాద్, కొడంగల్, పరిగి కాంగ్రెస్ టికెట్లపై కొంత క్లారిటీ ఉన్నా తాండూరు టికెట్‌పై సస్పెన్స్ కొనసాగుతోంది. తాండూరు టికెట్ ఎవరికి వరిస్తుందనే దానిపై చర్చ జరుగుతోంది. ఆశావహులు కూడా జాబితాలో తమ పేరు ఉంటుందా లేదా అని ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ అసెంబ్లీ స్థానాలున్నాయి. కొడంగల్ నుంచి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, పరిగి నుంచి డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి, వికారాబాద్ నుంచి మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ పోటీ చేసే అవకాశం ఉంది. దాదాపు వారి పేర్లు ఖరారైనట్లు సమాచారం. దీంతో ప్రసాద్‌కుమార్, రామ్మోహన్‌రెడ్డి ప్రచారాన్ని ప్రారంభించారు. వికారాబాద్ టికెట్ ఆశించి రాకపోవడంతో మాజీ మంత్రి చంద్రశేఖర్ కాంగ్రెస్ వీడి కమలం గూటికి చేరిన విషయం తెలిసిందే.

తాండూరు టికెట్‌పై..

తాండూరు కాంగ్రెస్ టికెట్‌పై ఉత్కంఠ నెలకొంది. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. దీంతో ఎవరికి వారు తమకే టికెట్ వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. పార్టీ శ్రేణులు సైతం రెండుగా చీలిపోయారు.

'కోడ్'ను పకడ్బందీగా అమలు చేస్తాం

- కలెక్టర్ నారాయణరెడ్డి
- పోలీసు అధికారులతో సమావేశం

అనంతగిరి: ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నియమావళిని తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ర్యాలీలు, బహిరంగ సభలకు కచ్చితంగా అనుమతులు ఉండాలన్నారు. ఎన్నికల ఫిర్యాదు కోసం సీ విజిల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చామని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోస్టర్లు, బ్యానర్ల ఏర్పాటులో ఎంసీసీ నియమాలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలన్నారు. అక్రమంగా డబ్బులు, మద్యం తరలింపుపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. చెక్ పోస్టుల వద్ద సీసీ టీవీలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఏఎస్పీ రవీందర్ రెడ్డి, డీటీసీ ఏఎస్పీ మురళీధర్, డీఎస్పీలు నర్సింలు, కరుణసాగర్ రెడ్డి, శేఖర్ గౌడ్, విజయ్ కుమార్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్ అర్బన్: కలెక్టరేట్‌లో మీడియా పాయింట్‌ను ప్రారంభిస్తున్న నారాయణరెడ్డి

కలెక్టరేట్‌లో మీడియా పాయింట్

వికారాబాద్ అర్బన్: ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు కలెక్టరేట్‌లో మీడియా పాయింట్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం మీడియా సెంటర్‌ను, మానిటరింగ్ కమిటీ సెల్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంసీఎంసీ కమిటీ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం జరుగుతుందన్నారు. అనుమతి లేకుండా ప్రకటనలు ఇస్తే వాటిని అభ్యర్థి ప్రచార ఖర్చు కింద జమ చేస్తామని తెలిపారు. సోషల్ మీడియాలో అభ్యర్థుల ప్రకటనలను కూడా పరిశీలిస్తామన్నారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న అన్ని రకాల ప్రకటనలకు ఎంసీఎంసీ ఆమోదం తెలపాలని ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను, 1950 కాల్ సెంటర్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, డీఆర్ డీఓ కృష్ణన్, డీవైఎస్ఓ హనుమంతరావు, ఎన్నికల నోడల్ అధికారులు ఉపేందర్, శ్రీనివాసరావు, సుధారాణి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- గురుకుల విద్యాలయాల సంస్థ అడిషనల్ సెక్రటరీ పార్వతీదేవి

మొయినాబాద్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ అడిషనల్ సెక్రటరీ పార్వతీదేవి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు గురుకుల పాఠశాల ఆవరణలో నాలుగు రోజుల పాటు నిర్వహించే గురుకులాల జోనల్ స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 11 బాలుర గురుకులాల నుంచి 955 మంది విద్యార్థులు పాల్గొంటున్న క్రీడా పోటీలను ఆమె బెలూన్లు ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రీడా స్ఫూర్తిని నింపేందుకు గురుకులాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గురుకులాల ప్రాంతీయ సమన్వయాధికారి శారద, భాస్కర ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంచందర్‌రావు, ప్రాంతీయ క్రీడాధికారి ఉదయభాస్కర్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ ఆదిబాబు, అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించండి

- డీసీసీ అధ్యక్షుడి సతీమణి ఉమా రామ్మోహన్‌రెడ్డి
- గుండాల గ్రామంలో ఆరు గ్యారంటీలపై ప్రచారం

దోమ: బీఆర్ఎస్ పార్టీపై ప్రజల్లో నమ్మకం పోయిందని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడి సతీమణి ఉమా రామ్మోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని గుండాల గ్రామంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలపై ఇంటింట ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు అమలు కావడం ఖాయమన్నారు. మహిళా సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రామగోవర్ధన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రమేశ్‌గౌడ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గుండాల గ్రామంలో ప్రచారం చేస్తున్న ఉమారెడ్డి

పేదల జీవితాల్లో వెలుగులే లక్ష్యం

కుల్కచర్ల: నిరుపేద, బడుగుబలహీన వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కుస్మసముద్రం, ముజాహిద్‌పూర్ గ్రామాలకు చెందిన ఆయా పార్టీల కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో పేదలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఆ నమ్మకంతోనే కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు సిద్ధమయ్యారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మండల అధ్యక్షులు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్య, నాయకులు ఆనందం, బాబు, కృష్ణయ్య, శివరాములు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఆర్‌సీ ఇప్పిస్తానని పిలిచి..

అన్నను హతమార్చిన తమ్ముడు

- తన వాటా భూ విక్రయానికి అడ్డుగా ఉన్నాడని ఘాతుకం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కరుణ సాగర్‌రెడ్డి

పరిగి: తన వాటా భూమిని విక్రయించడానికి అడ్డుగా ఉన్నాడని భావించిన తమ్ముడు అన్నను పథకం ప్రకారం హతమార్చాడు. ఈ సంఘటన పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం పరిగి సీఐ కార్యాలయంలో డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి వెల్లడించారు. బొంరాస్‌పేట్ మండలం చౌదర్‌పల్లికి చెందిన సాయన్నకు ఏడుగురు కొడుకులు. తల్లిదండ్రుల పేరిట 11 ఎకరాల భూమి ఉంది. జోగు రాములు అందరి కంటే చిన్నవాడు. గతంలో బాలికను వివాహం చేసుకోవడంతో అతనిపై బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బాలికను ఎత్తుకెళ్లడానికి ఉపయోగించిన బైక్‌ను సీజ్ చేసి జైలుకు పంపారు. ఆ బైక్ అన్న చిన్న నర్సింలుది కావడంతో జైలు నుంచి వచ్చిన తమ్ముడు రాములిని నిత్యం బైక్ కావాలని అడిగేవాడు. దీంతో కోర్టులో పిటీషన్ వేసి బైక్ తెచ్చి అన్నకు ఇచ్చాడు. కానీ ఆర్‌సీ ఇవ్వలేదు. కోర్టు కేసు రాజీ చేసుకోవడం తోపాటు అప్పులు తీర్చుకోవాలని భావించిన రాములు తన వాటా భూమి విక్రయించాలని అనుకున్నాడు. ఐదుగురు అన్నలు ఒప్పుకున్నారు. నర్సింహులు మాత్రం ఒప్పుకోలేదు. దీంతో రాములు అన్నను హతమార్చాలని భావించాడు. ఇందుకోసం పథకం వేశాడు. ఈ నెల 10న అన్నకు ఫోన్ చేశాడు. బైక్ ఆర్‌సీ ఇవ్వడానికి అధికారులు ఒప్పుకున్నారని, నీ సంతకం కావాలని వికారాబాద్‌కు తీసుకెళ్లాడు. అక్కడ సార్ లేడు తుంకులగడ్డ సమీపంలోని ఫాంహౌస్‌లో ఉన్నాడని చెప్పి లక్నాపూర్ ప్రాజెక్టు దగ్గరకు తీసుకొచ్చాడు. అక్కడ బైక్ ఆపి తన వెంట తెచ్చుకున్న సుత్తితో అన్న తలపై బలంగా మోదాడు. అనంతరం బండరాయితో ముఖంపై కొట్టాడు. అన్న నర్సింహులు చనిపోయాడని నిర్ధారించుకొని ప్యాంట్ జేబులో ఉన్న సెల్‌ఫోన్, రూ. 300 తీసుకుని షాద్‌నగర్‌కు వెళ్లాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారించారు. రాములు నేరం ఒప్పుకోవడంతో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ వెంకట రామయ్య, ఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి


ఘణపురం వెంకటయ్య

కుల్కచర్ల: 40 ఏళ్లుగా పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు కృషిచేసిన తన పేరును పరిగి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి అధిష్టానం పరిశీలించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేస్తున్న తనను జాతీయ, రాష్ట్ర నాయకత్వం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో పార్టీ కోసం పనిచేస్తున్న వారిని విస్మరించడం సరైంది కాదని, పార్టీ అభ్యున్నతికి కృషిచేస్తున్న వారికి గుర్తింపు ఇవ్వాలని పేర్కొన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన


అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల విధుల నిర్వాహణకు సంబంధించిన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలన్నారు. ప్రతి రోజు ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆయా విభాగాల నోడల్ అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

తనిఖీలు ముమ్మరం

వికారాబాద్ అర్బన్: ఎన్నికల వేల హవాలా డబ్బును నిలువరించేందుకు పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో వాహనాలను క్షణంగా తనిఖీలు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వికారాబాద్‌కు వచ్చే వారిపై ప్రత్యేక దృష్టి సారించి.. వివరాలు తెలుసుకుంటున్నారు. ఇతర జిల్లాలకు చెందిన కార్లు, ఇతర వాహనాలు వస్తే వాటిని ప్రత్యేకంగా తనిఖీలు చేస్తున్నారు.

మిస్సింగ్ కేసు విషాదాంతం

- తోలుకట్ట సమీపంలో మల్లేశ్ మృతదేహం లభ్యం
- మూడురోజుల క్రితం పీఎస్‌లో మిస్సింగ్ కేసు నమోదు

మొయినాబాద్: ఐదు రోజులుగా కనిపించకుండా పోయిన వ్యక్తి మృతదేహం అనుమానాస్పదస్థితిలో లభించిన సంఘటన మండల పరిధిలోని తోలుకట్టలో శుక్రవారం ఉదయం వెలుగుచూసింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తోలుకట్ట గ్రామానికి చెందిన మోండ్ర మల్లేశ్ (50) కిరాణాషాప్ నిర్వహిస్తున్నాడు. మల్లేశ్ ఈనెల 9న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ క్రమంలో భర్త కనిపించడంలేదని అతని భార్య పార్వతమ్మ బుధవారం మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా శుక్రవారం ఉదయం తోలుకట్ట గేటు సమీపంలోని ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిలో మల్లేశ్ మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి మెడకు టవల్ బిగించి మొడ భాగంలో కమిలిపోయినట్లు ఉంది. పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మృతిపై పలు అనుమానాలు..

మల్లేశ్‌ను ఎవరో హత్య చేసి గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమిలో పడేసి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉరి వేసుకున్నట్లు మెడకు టవల్ ఉన్నా భూమిపైనే పడుకుని ఉండటం, టవల్ ఒక చిన్న అలందంటుకు కట్టి ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిందని.. మూడు రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు చెబుతున్నారు. మృతుడికి భార్య పార్వతమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నిలిచేదెవరు..? గెలిచేదెవరు?

- పరిగిపై పార్టీల ఫోకస్
- గెలుపే లక్ష్యంగా నాయకుల వ్యూహాలు
- ప్రచారం ప్రారంభించిన కాంగ్రెస్
- 'గ్యారంటీ'లపైనే హస్తం పార్టీ ఆశలు
- ముహూర్తం కోసం ఎదురుచూస్తున్న బీఆర్ఎస్, టీడీపీ



పరిగి: జిల్లా రాజకీయాలు ఈ సారి రసవత్తరంగా మారబోతున్నాయి. మరీ ముఖ్యంగా పరిగి నియోజవర్గంపై అన్ని పార్టీలు ఫోకస్ పెట్టాయి. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత జరిగిన రెండు సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే ప్రధానంగా తలపడ్డాయి. అయితే ఈ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదుగుతోంది. టీడీపీ కూడా పోటీలో తలపడేందుకు సిద్ధంగా ఉంది. టీడీపీ బరిలో ఉన్నప్పటికీ.. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్యే ప్రధానమైన పోటీ ఉండబోతుందనేది ఎవరూ కాదనలేని సత్యం. అందువల్ల ఈ ఎన్నికల్లో ముక్కోణపు పోటీ ఖాయంగా కనిపిస్తోంది. పరిగి నియోజకవర్గంలో మూడు పార్టీలు సత్తా చాటాలను ఉవ్విళ్లూరుతున్నాయి. గెలుపే లక్ష్యంగా పార్టీలన్నీ పావులు కదుపుతున్నాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు తొమ్మిదేళ్లలో పరిగి నియోజకవర్గంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికార పార్టీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. ఇక హస్తం పార్టీ ఆరు గ్యారంటీ స్కీంలపైనే గంపెడాశ పెట్టుకుంది. ఇప్పటికే నియోజకవర్గంలో 'ఇంటింటికీ కాంగ్రెస్' పేరుతో కలియతిరుగుతున్నారు ఆ పార్టీ నేతలు. కాషాయ దళం మాత్రం కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి ఓటర్లను ఆకర్షించాలని భావిస్తోంది. మూడు పార్టీల నేతలు ప్రజలను మచ్చిక చేసుకునేందుకు అస్త్రశస్త్రాలను రెడీగా పెట్టుకున్నారు.

గ్రామీణ ఓటర్లే లక్ష్యం

నియోజకవర్గంలో మొత్తం 2,52,537 ఓట్లు, 305 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. పరిగి, దోమ, పూడూర్, కుల్కచర్ల, చౌడాపూర్, గండీడ్, మహ్మదాబాద్‌తో పాటు ఒక మున్సిపాలిటి, 7 మండలాలు ఉన్నాయి. మున్సిపాలిటితో పాటు గ్రామీణ ఓటర్లపై నాయకులు దృష్టి పెట్టారు. పట్టణ ఓటర్లు ఇప్పటికే ఎవరికి ఓటు వేయాలో ముందే నిర్ణయం తీసుకున్నారనే వార్తలు గుప్పుమంటున్నాయి. అందువల్ల గ్రామీణ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పార్టీలు పోటీ పడుతున్నాయి. అందరికంటే ముందు బీఆర్ఎస్ పార్టీ పరిగి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేరును ఖరారు చేసింది. కాంగ్రెస్ పార్టీలో ఆశవహులు చాలా మంది ఉన్నా.. అధిష్టానం మాత్రం డీసీసీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిపై మొగ్గుచూపే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు అభ్యర్థి ఎంపికలో కాషాయపార్టీ తర్జనభర్జన పడుతోందనే ప్రచారం జరుగుతోంది. టీడీపీ అభ్యర్థిగా కాసాని వీరేశ్ బరిలో ఉండనున్నారు.

దూకుడు పెంచిన కాంగ్రెస్

అధికారాన్ని హస్తంగతం చేసుకునేందుకు హస్తం పార్టీ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ప్రధానంగా ఆ పార్టీ నేతలు గ్యారంటీ పథకాలే గట్టెక్కిస్తాయని ధీమాతో ఉన్నారు. రామ్మోహన్‌రెడ్డి కుటుంబం మొత్తం గ్రామాల్లో తిరుగుతూ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.500లకే గ్యాస్ సిలిండర్, ప్రతి మహిళకు మహాలక్ష్మి పథకం ద్వారా రూ. 2,500 పెన్షన్, ఉచిత బస్ ప్రయాణం, వృద్ధులకు రూ. 4,000 పెన్షన్, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు. యువ వికాస్‌తో పాటు వరంగల్ డిక్లరేషన్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్నారు.

మౌనంగా బీఆర్ఎస్, బీజేపీ

కాంగ్రెస్ ప్రచారంలో దూసుకుపోతుంటే.. బీఆర్ఎస్, బీజేపీ మాత్రం మౌనంగా ఉన్నాయి. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించినప్పటికీ మెనిఫెస్టో ప్రకటించకపోవడంతో ఇంకా ప్రజల్లోకి వెళ్లడం లేదని సమాచారం. డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో ఆయన వర్గంలో కొంతమంది ఆ పార్టీ తీర్థం పుచ్చుకుంది. మిగిలిన వారిని కూడా తనవైపు తిప్పుకునేందుకు మనోహర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన వెంట బీఆర్ఎస్ క్యాడర్ వెళ్లకుండా మహేశ్‌రెడ్డి నిలువరించే ప్రయత్నిస్తున్నారని సమాచారం. బీజేపీలో పరిగి టికెట్‌ను ఆశిస్తున్నవారు చాలా మందే ఉన్నారు. అభ్యర్థి ప్రకటన తర్వాతే ప్రచారం చేయాలని కమలం నేతలు భావిస్తున్నారు. టీడీపీ నుంచి వీరేశ్ ముహూర్తం కోసం వేచి చూస్తున్నట్టు సమాచారం.

క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కొడంగల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం స్థానిక సర్పంచ్ పకీరప్ప మాట్లాడుతూ పది రోజుల పాటు క్రికెట్ పోటీలు జరుగుతాయని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, నాయకులు లింగప్ప, మల్లయ్య, చాంద్‌పాష పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన పలువురు యువకులు మండల పార్టీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే కోరారు.

తల్లిదండ్రుల కలలను నిజం చేద్దాం


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్

వికారాబాద్ అర్బన్: విద్యార్థులు ప్రైవేట్ కళాశాల్లో వేల రూపాయలు ఫీజులు చెల్లించి తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బంది పెట్టకూడదని, ప్రభుత్వ కళాశాలల్లో చదివి వారి కలలను నిజం చేద్దామని వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లయ్య అన్నారు. శుక్రవారం వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడ అన్ని వసతులున్నాయని, విలువలతో కూడిన విద్యా బోధన జరుగుతున్నట్లు తెలిపారు. ఎంతో అనుభవం ఉన్న అధ్యాపకులు పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బతుకమ్మ, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చిన్న సోమన్న, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్వర్ స్వామి, వైస్ ప్రిన్సిపల్ నరసింహారెడ్డి, అధ్యాపకులు నారాయణ రావు, చెన్నయ్య, కిషన్ రావు, ప్రభు పాల్గొన్నారు.


కోడిగుడ్ల పెంకులపై నాయకుల చిత్రాలు

వెరీ 'గుడ్డు'

దౌల్తాబాద్: మండలంలోని యాంకి గ్రామానికి చెందిన చిత్రకారుడు అశోక్ ప్రపంచ కోడిగుడ్ల దినోత్సవం సందర్భంగా కళా నైపుణ్యం ప్రదర్శించారు. మార్కర్ పెన్నుతో కోడిగుడ్డు పెంకులపై కార్టూన్ బొమ్మలు వేసి ఔరా అనిపించుకున్నారు. స్వతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తలు, రాజకీయ నాయకులు, క్రీడాకారులు, నోబెల్ గ్రహీతలు, కవులు, కళాకారుల చిత్రాలను వంద కోడిగుడ్ల పెంకులపై చిత్రించాడు. ఈ చిత్రాలు చూసిన పలువురు అశోక్‌ను ప్రశంసించారు.

తెలంగాణలో కాంగ్రెస్ అనుకూల పవనాలు

మాజీమంత్రి ప్రసాద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి

- కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయం
- 16న వికారాబాద్‌లో బహిరంగ సభ
- మీటింగ్‌ను విజయవంతం చేయాలని నేతల పిలుపు


మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్, యాదవ రెడ్డి తదితరులు

అనంతగిరి: రాష్ట్రంలో కాంగ్రెస్ అనుకూల పవనాలు వీస్తున్నాయని, తప్పకుండా అధికారంలోకి వస్తుందని మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 16న వికారాబాద్ పట్టణంలోని చిగుళ్లపల్లి మైదానంలో భారీ బహిరంగ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్న ముఖ్య నాయకులు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండల్ రెడ్డి, ధారూర్ మండల పీఏసీఎస్ మాజీ చైర్మన్ హనుమంత్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ముత్తాహర్ షరీఫ్‌తో పాటు పార్టీ సీనియర్ నాయకులతో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వారు సభా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ 16న జరిగే బహిరంగ సభలో వికారాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు 15 వేల మందితో పార్టీలోచేరబోతున్నారనితెలిపారు. తన విజయాన్ని ఆకాంక్షిస్తూ పార్టీలో చేరుతున్న వారిని సాదరంగా ఆహ్వానిస్తున్నామన్నారు. అందరం కలిసి పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. జిల్లాలో నాలుగు స్థానాల్లో విజయం సాధిస్తామని మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి జోస్యం చెప్పారు. వికారాబాద్‌లో ప్రసాద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ప్రకటించారు. అనంతరం మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రసాద్ కుమార్ గెలుపే ధ్యేయంగా పార్టీలో చేరుతున్నామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు కిషన్ నాయక్, సత్యనారాయణ, రామచంద్రారెడ్డి, రాములు, నర్సింలు, జాఫర్ పాల్గొన్నారు.

స్థలాన్ని ఆక్రమిస్తే సహించేది లేదు

టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు శివకుమార్


ఆందోళన చేస్తున్న టీఎన్‌జీఓ సభ్యులు

పరిగి: పరిగి ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న టీఎన్‌జీఓ స్థలాన్ని ఆక్రమిస్తే సహించేది లేదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్ హెచ్చరించారు. టీఎస్‌జీఓ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టడంతో విషయం తెలుసుకున్న టీఎన్‌జీఓ జిల్లా కార్యవర్గం శుక్రవారం ఆందోళనకు దిగింది. అనంతరం స్థలంలో ఎవరూ నిర్మాణాలు చేపట్టకుండా గేటును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ స్థలాన్ని ఆక్రమించారని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు అంజత్, నర్సింహులు, వెంకట్, ప్రవీణ్, రమేశ్, ప్రవీణ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత.. కేసు నమోదు


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

పెద్దేముల్: అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దుగ్గాపూర్ గ్రామంలో గొట్లపల్లి రవి అనే వ్యక్తి అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న పెద్దేముల్ పోలీసులు దుకాణంపై దాడులు చేసి.. రాయల్ స్టాగ్ 180 ఎంయల్-4, ఆఫీసర్స్ ఛాయస్ 180 ఎంయల్-17, డవున్ టోన్ 180 ఎంయల్-19, ఓసీ 90 ఎంయల్-09 సీసాలను స్వాదీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


ప్రచార రథాలను ప్రారంభించిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ప్రచార రథాలను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేసిందని.. వాటిని ప్రచారరథాల ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్త, వైస్ ఎంపీపీలు ఆనంద్, అనంతరెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, కృష్ణయ్య, ఎంపీటీసీ గోపాల్, జిల్లా రైతుబంధు సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, అంజి తదితరులు ఉన్నారు.

చందా ఇవ్వాలని బెదిరింపు

పలువురు యువకులపై కేసు నమోదు

నందిగామ: నవరాత్రి ఉత్సవాల పేరుతో చందాలు కావాలంటూ ఓ పరిశ్రమ నిర్వహకుడిని బెదిరించిన యువకులపై కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ సురేశ్ కథనం ప్రకారం వివరాలు.. మండల పరిధిలోని చేగూరు శివారులోని ముస్కాన్ రోటో పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో నర్సప్పగూడ గ్రామానికి చెందిన వడ్ల అరవింద్, చాకలి అశోక్, లక్ష్మణ్, రమేశ్, జంగోనిగూడకు చెందిన జంగా రజనీకాంత్‌తో పాటు మరికొంత మంది ఈనెల 9న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చందా కోసం పరిశ్రమలోని సూపర్‌వైజర్ పుల్లం రాజును సంప్రదించారు. దీంతో ప్రతి ఏటా ఇస్తున్నట్లుగా రూ.6,500 పుల్లంరాజు ఆ యువకులకు ఇవ్వబోతుకండగా వద్దని వారించారు. మేం మీ దగ్గర అడుక్కోడానికి వచ్చామా...అంటూ దబాయించారు. అంతటితో ఆగకుండా మీ సారూ(యజమాని)ని కిందికి పిలవాలని రాజును బెదిరించారు. రూ.30వేలు ఇస్తే సరే.. లేదంటే మీ సంగతి చూస్తాం అంటూ బూతులు తిట్టారు. అక్రమంగా పరిశ్రమలోకి ప్రవేశించి బూతుమాటలు తిట్టి, బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలని రాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కారును ఢీకొట్టిన లారీ

యాచారం: నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారిపై గునుగల్ గేట్ సమీపంలో లారీ, కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. నగరంలోని ఎన్‌జీఓ కాలనీకి చెందిన రాజశేఖర్ తన సమీప బంధువు సరస్వతితో కలిసి కారులో శుక్రవారం సాయంత్రం యాచారం వైపు నుంచి ఇబ్రహీంపట్నం వెళ్తున్నారు. మార్గ మధ్యలో గునుగల్ గేట్ వద్ద ఇబ్రహీంపట్నం నుంచి యాచారం వైపు వస్తున్న లారీ గునుగల్ గేట్ వద్ద వారి కారును ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారులో ఉన్న రాజశేఖర్, సరస్వతికి తీవ్ర గాయాలు కాగా 108లో నగరంలోని ఓ ప్రవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ డీటీగా రామకృష్ణ

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండల డిప్యూటీ తహసీల్దార్‌గా వై.రామకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన వేణుకుమార్ శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ కాగా ఆయన స్థానంలో శంషాబాద్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రామకృష్ణ అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ కార్యాయానికి బదిలీపై వచ్చారు రామకృష్ణ మాట్లాడుతూ.. రెవెన్యూ కార్యాలయానికి వచ్చే ప్రజా సమస్యల, రెవెన్యూ సేవల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానన్నారు. దీంతో పాటు మండలంలోని ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటానన్నారు.

మహిళ దుర్మరణం

చేవెళ్ల: గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఫరూక్‌నగర్ మండలం యెల్లంపల్లికి చెందిన రాములు భార్య.. నర్సమ్మ (35) భర్తతో వేరుపడి ముగ్గురు పిల్లలతో కలిసి కొంత కాలంగా షాద్‌నగర్‌లో వేరుగా ఉంటుంది. ఆమె 12వ తేదీ (గురువారం) యెల్లంపల్లికి వెళ్లగా సాయంత్రం తిరిగి షాద్‌నగర్‌కు వచ్చింది. శుక్రవారం ఉదయం తెల్లవారుజామున 3 గంటల సమయంలో చేవెళ్ల మండలంలోని ముడిమ్యాల, కందవాడ బస్ స్టేజీల మధ్య నడుచుకుంటూ వెళ్తున్న ఆమెను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు కావటంతో అక్కడిక్కడే మృతి చెందింది. ఆమె మృతదేహం వద్ద లభించిన ఆధారాలతో పోలీసులు.. ఆమె భర్త ఎర్ర రాములకు ఫోన్‌చేసి సమాచారం అందించారు.

పెద్దల యాదిలో..!

పల్లెల్లో పెత్తరమాస పూజలు


పూజలు చేస్తున్న కుటుంబం

బొంరాస్‌పేట: ఏడాదికోసారి పెత్తరమాస పేరుతో పల్లెల్లో దివంగతులైన వారి యాదిలో శుక్రవారం పూజలు చేసి నివాళులర్పించారు. బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని పల్లెల్లో చనిపోయిన కుటుంబసభ్యులు, వంశస్తుల ఫొటోలను నట్టింట్లో ఉంచి పూలు, పండ్లు, కొత్తబట్టలు, తినుపదార్థాలు పెట్టి సంప్రదాయ బద్ధంగా పూజలు చేసి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని మొక్కుకున్నారు.

పనుల పరిశీలన


నర్సరీని పరిశీలిస్తున్న అమిత్ మాలెంపాటి

ధారూరు: మండల పరిధిలోని స్టేషన్‌ధారూరులో పూర్తైన పనులను శుక్రవారం ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి పరిశీలించారు. గ్రామంలో నిర్మించిన అండర్ డ్రైనేజీ పనులను, నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ సురేశ్, సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యేది అక్రమ సంపాదనే

- 300 ఎకరాలు ఎలా సంపాదించారో ఆనంద్ చెప్పాలి
- ఆత్మహత్యలకు కేసీఆర్, కేటీఆర్ బాధ్యత వహించాలి
- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూరు: వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్ తండ్రి పేరిట కేవలం రెండు ఎకరాల అసైన్డ్ భూమి మాత్రమే ఉండేదని, నేడు 300 ఎకరాలు ఎలా సంపాదించారో ప్రజలకు చెప్పాలని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ డిమాండ్ చేశారు. అభివృద్ధిని గాలికొదిలేసి అక్రమ సంపాదనకు ఎమ్మెల్యే అలవాటు పడ్డారని ఆరోపించారు. శుక్రవారం మండలంలోని ఎబ్బనూర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ నియామకాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఉపాధ్యాయ దంపతులకు ఒకే చోట పోస్టింగ్ ఇస్తామని చెప్పి వేర్వేరు జిల్లాలకు వేయడం దారుణమన్నారు. నిరుద్యోగ యువత ఆత్మహత్యలకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తండ్రి, కొడుకు, అల్లుడు, కూతురు కలిసి భూ కబ్జాల వింగ్‌గా ఏర్పడి నగరం చుట్టూ 25 వేల ఎకరాలు దోచుకున్నారని ఆరోపించారు. ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని లాక్కున్న పేదల భూములను తాము అధికారంలోకి రాగానే పేదలకే ఇస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో సఖ్యతగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాములు, నాయకులు మహ్మద్ బాబాఖాన్, రామచంద్రారెడ్డి, మల్లారెడ్డి, హన్మయ్య, బుజ్జయ్యగౌడ్, లింగనపల్లి అశోక్, అవినాశ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

సాక్షి
వికారాబాద్
శనివారం । 14 । అక్టోబర్ । 2023




రాష్ట్రాన్ని దోచిన ప్రభుత్వం

తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను నిలువునా దోపిడీ చేసిందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. 5లో▸



రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

వికారాబాద్‌లో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. 5లో▸



బతుకమ్మ సందడి

బతుకమ్మను పురస్కరించుకుని తెలుగు కదలిక సాహిత్య పరిషత్ ఉమెన్స్ ఎంపవర్ మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 5లో▸

న్యూస్‌రీల్

ధ్రువపత్రాల పరిశీలన



మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో పరిశీలించారు. మొత్తం 277 మంది అభ్యర్థులకు గాను 266 మంది సర్టిఫికెట్లతో వచ్చారు. ఈ నెల 16, 17 తేదీల్లో మెడికల్ టెస్ట్ ఉంటుందని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఎస్పీ కార్యాలయంలో ఉదయం నిర్వహించే మెడికల్ టెస్ట్‌కు రావాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఏఎస్పీలు రవీందర్‌రెడ్డి, మురళీధర్, ఏఆర్ డీఎస్పీ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ మేనిఫెస్టో విడుదల చేయాలి

సంఘం నాయకుడు రాజ్‌కుమార్



రాజ్‌కుమార్

తాండూరు టౌన్: రాబోయే ఎన్నికల్లో బీసీల డిమాండ్లతో కూడిన మేనిఫెస్టోను విడుదల చేయాలని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అన్ని పార్టీలు ఈ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు టికెట్లు కేటాయించాలన్నారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కేటాయించేలా, అధికారంలోకి వచ్చే ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. జనగణనతో పాటు కులగణన కూడా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అన్ని రంగాల్లో బీసీలు అట్టడుగున ఉన్నారని, వారి ఆర్థికాభివృద్ధికి బడ్జెట్‌లో సముచిత న్యాయం జరిగేలా చూడాలన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

అనంతగిరి: విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర నాయకులు శివరాజు, శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలలో 200 పాయింట్లకు 134 పాయింట్లతో దేశంలోని 748 జిల్లాలకు గాను 337వ స్థానంలో నిలవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. 6 అంశాలలో 600 పాయింట్లకు గాను 328 పాయింట్లతో దేశంలో 436 స్థానంలో నిలిచిందన్నారు. నాణ్యమైన విద్యను అందించకపోవడంతో తరతరాల వెనుకబాటుకు గురవుతారని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించే గ్యారంటీ ప్రభుత్వం చట్టబద్ధ బాధ్యతగా తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు వెంకటయ్య, నర్సింలు, వెంకటేష్, రాములు, దేవకుమారి, ఆశలతా, ఉమాదేవి , బిస్మిల్లా బేగం తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలించిందని..

యువకుడి బలవన్మరణం

తాండూరు రూరల్: జులాయిగా తిరుగుతున్నాడని తల్లి మందలించడంతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఘటన మండలంలోని నారాయణపూర్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీరేశం కథనం ప్రకారం.. తాండూరు మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన రాంచందర్ (27) పనికి వెళ్లకుండా ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. పనికి వెళ్లాలని తల్లి మందలించింది. దీంతో ఆ యువకుడు శుక్రవారం గ్రామ శివారులోని మంతట్టి–నారాయణపూర్ మధ్య రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని నారాయపూర్‌కు తరలించారు.

రైతులు సహకరించాలి

షాబాద్: రైతులు పంటల సాగు విషయంలో అధికారులకు సహకరించాలని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి అన్నారు. షాబాద్ క్లస్టర్‌లో రైతులు సాగు చేసిన పంటల నమోదును శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యవసాయ విస్తరణ అధికారులు సర్వే నంబర్ల వారీగా రైతులు సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేయాలని సూచించారు. దీంతో సాగు విస్తీర్ణం లెక్క సక్రమంగా తెలుస్తుందని, పంటల నమోదు ఆధారంగానే ప్రభుత్వం పంటలను కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం, ఏఈఓ రాజేశ్వరి, పలువురు రైతులు ఉన్నారు.

నగదు నొక్కేస్తున్నారా?

- పట్టుబడిన డబ్బు.. పోలీసులు చూపుతున్న లెక్కల్లో వ్యత్యాసం
- వికారాబాద్‌లో వైరల్ అవుతున్న వీడియో
- రూ.10 లక్షలు పట్టుబడితే రూ. 9.5 లక్షలే చూపించారు
- పరిగిలోనూ ఇలాంటి సంఘటనే..



వికారాబాద్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

వికారాబాద్: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే వదిలేస్తున్నారు. ఈ నేపథ్యంలో పలు చోట్ల రూ.లక్షల్లో నగదు పట్టుబడుతోంది. యాభై వేలకు మించి తీసుకెళ్లాలంటే ఎందుకు, ఎక్కడికి, ఏ అవసరం మీద తరలిస్తున్నారో చెప్పాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. చాలా మంది తెలిసో తెలియకో.. తప్పించుకోలేమా.. అనే అతి విశ్వాసంతో భారీగా నగదు తరలిస్తూ పోలీసులకు చిక్కుతున్నారు. అయితే పట్టుబడి డబ్బులకు సంబంధించి లెక్కలు చూపించడంలో పారదర్శకత కనిపించడం లేదు. సీజ్ చేసిన డబ్బులో కొంత మొత్తం నొక్కేసి మిగతాది లెక్క చూపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల వికారాబాద్‌లో నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన డబ్బుల్లో కొంత నగదు నొక్కేశారనే వీడియో వైరల్‌గా మారింది. వికారాబాద్ తనిఖీల్లో కారులో తరలిస్తున్న రూ.10 లక్షలు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డబ్బు లెక్కిస్తుండగా వీడియో చిత్రీకరించారు. ఆ వీడియోలో రూ.10 లక్షల నగదు ఉన్నట్లు కనిపించింది. అయితే అధికారులు మాత్రం రూ. 9.5 లక్షలు పట్టుబడినట్లు చూపించారు. నగదు లెక్కింపు వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇటీవల పరిగి మండలంలోని ఓ చెక్‌పోస్టు వద్ద కూడా ఇలాంటి సంఘటనే చోటు చేసుకుంది. రూ.50 వేలు తీసుకుని డబ్బులు సీజ్ చేయకుండా వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లక్ష్యం నెరవేరేనా?

ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా ఎన్నికలు నిర్వహించాలనే లక్ష్యంతో ఎన్నికల కమిషన్ నగదు, మద్యాన్ని కట్టడి చేసేందుకు చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తోంది. విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తోంది. అయితే కొంతమంది అధికారులు చేస్తున్న పనుల వల్ల అందరికీ చెడ్డ పేరు వస్తోంది. ఇదిలా ఉండగా ఎన్నికల కోసం తరలిస్తున్న డబ్బు పట్టుబడిన దాఖాలాలు కనిపించడం లేదు. వ్యక్తిగత, వ్యాపార అవసరాల కోసం తీసుకెళుతున్న డబ్బే పట్టుబడుతోంది. అయితే ఎన్నికలకు సంబంధించిన డబ్బు చేరాల్సిన చోటికి సురక్షితంగా చేరుతోందని పలువురు అంటున్నారు. అధికారులు నిఘాను మరింత పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్లాపూర్ వద్ద రూ.2.38 లక్షలు స్వాధీనం

తాండూరు రూరల్: మండలంలోని కొత్లాపూర్, అంతారం చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. కర్ణాటక నుంచి తెలంగాణకు డబ్బు, మద్యం రవాణా కాకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. తాండూరు మండలం మిట్టబాసుపల్లికి చెందిన శంకర్‌నాయక్ కర్ణాటక నుంచి బైక్‌పై వస్తుండగా కొత్లాపూర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేశారు. అతని వద్ద రూ. 2.38 లక్షలు ఉండడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. రూ.50 వేలకు మించి డబ్బు ఉంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు. తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ వాహనాన్ని పట్టణ పోలీసులు తనిఖీ చేశారు. శుక్రవారం అంతారం వద్ద ఆమె వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.



అంతారం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

హస్తాన్ని భస్మం చేస్తాం

- కాంగ్రెస్ పార్టీపై ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫైర్
- 45 రోజులు నాకోసం పని చేయండి
- ఐదేళ్లు మీ కోసం పని చేస్తా
- యువతను కోరిన పైలెట్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపాలని చూస్తే.. ఆ హస్తాన్ని భస్మం చేసి చూపిస్తానని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని ఏఆర్ గార్డెన్‌లో నియోజకవర్గంలోని యువకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు మరో 45 రోజుల సమయం ఉందని, యువతనా కోసం పని చేయాలని, తాను ఐదేళ్ల పాటు మీ కోసం పని చేస్తానని స్పష్టం చేశారు. యువత తలచుకుంటే సాధించలేనిదంటూ ఉండదన్నారు. ఎన్నికల్లో బంపర్ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారని అన్నారు. సీఎం చొరవతో నియోజకవర్గాన్ని వందల కోట్లతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. తెలంగాణ అభివృద్ధికి బీజేపీ అడ్డుపడుతోందని మండిపడ్డారు. తాండూరులో విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేశాన్నారు. 50 ఏళ్లుగా ఎవరూ చేయని అభివృద్ధిని తాను చేసి చూపించానన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సందల్ రాజుగౌడ్, నాయకులు కరణం పురుషోత్తం రావు, శ్రీశైల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉండండి.. ఆశీర్వదించండి

- మంత్రి సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: ముఖ్యమంత్రిగా కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. ప్రజలకు మంచి చేసిన ప్రభుత్వానికి అండగా నిలబడాలని ఆమె కోరారు. శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సరూర్‌నగర్ డివిజన్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో కోట్లాది రూపాయల నిధులు తెచ్చి మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపినట్లు చెప్పారు. రానున్న కాలంలో మరింత అభివృద్ధి చేయడానికి అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. విద్యాశాఖ నుంచి రూ.100 కోట్లు వెచ్చించి మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి సైనికుల్లాంటి కార్యకర్తల బలం ఉందని, ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రతి గడపకూ బీఆర్ఎస్ సంక్షేమ కార్యక్రమాలు చేరాయని, వారందరినీ కలిసి మరింత మంచి కోసం బీఆర్ఎస్‌కు మద్దతు కోరాలన్నారు. ప్రజలకు, పార్టీకి మధ్య వారధులుగా పనిచేయాలన్నారు. ఇంటింటి ప్రచారం నిర్వహించి నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు అరవింద్ శర్మ, బేర బాలకిషన్, మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనిత, పార్టీ డివిజన్ అధ్యక్షుడు మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావహుల్లో ఉత్కంఠ

- కాంగ్రెస్ జాబితా సిద్ధమంటూ ప్రచారం
- తాండూరు టికెట్ కోసం డీసీసీబీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పోటీ
- రెండు గ్రూపులుగా విడిపోయి ప్రచారం



వికారాబాద్: జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న వారిలో ఉత్కంఠ నెలకొంది. వారి భవితవ్యం నేడో రేపో తేలిపోనుంది. అభ్యర్థుల తొలి జాబితాను ఒకటి రెండు రోజుల్లో ప్రకటిస్తామని పీసీసీ ప్రకటించడంతో నేతల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే బీఆర్ఎస్ నాలుగు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించడంతో వారు ప్రజల్లోకి వెళుతున్నారు. అయితే వికారాబాద్, కొడంగల్, పరిగి కాంగ్రెస్ టికెట్లపై కొంత క్లారిటీ ఉన్నా తాండూరు టికెట్‌పై సస్పెన్స్ కొనసాగుతోంది. తాండూరు టికెట్ ఎవరికి వరిస్తుందనే దానిపై చర్చ జరుగుతోంది. ఆశావహులు కూడా జాబితాలో తమ పేరు ఉంటుందా లేదా అని ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ అసెంబ్లీ స్థానాలున్నాయి. కొడంగల్ నుంచి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, పరిగి నుంచి డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి, వికారాబాద్ నుంచి మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ పోటీ చేసే అవకాశం ఉంది. దాదాపు వారి పేర్లు ఖరారైనట్లు సమాచారం. దీంతో ప్రసాద్‌కుమార్, రామ్మోహన్‌రెడ్డి ప్రచారాన్ని ప్రారంభించారు. వికారాబాద్ టికెట్ ఆశించి రాకపోవడంతో మాజీ మంత్రి చంద్రశేఖర్ కాంగ్రెస్ వీడి కమలం గూటికి చేరిన విషయం తెలిసిందే.

తాండూరు టికెట్‌పై..

తాండూరు కాంగ్రెస్ టికెట్‌పై ఉత్కంఠ నెలకొంది. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. దీంతో ఎవరికి వారు తమకే టికెట్ వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. పార్టీ శ్రేణులు సైతం రెండుగా చీలిపోయారు.

‘కోడ్’ను పకడ్బందీగా అమలు చేస్తాం

- కలెక్టర్ నారాయణరెడ్డి
- పోలీసు అధికారులతో సమావేశం



వికారాబాద్ అర్బన్: కలెక్టరేట్‌లో మీడియా పాయింట్‌ను ప్రారంభిస్తున్న నారాయణరెడ్డి

అనంతగిరి: ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నియమావళిని తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ర్యాలీలు, బహిరంగ సభలకు కచ్చితంగా అనుమతులు ఉండాలన్నారు. ఎన్నికల ఫిర్యాదు కోసం సీ విజిల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చామని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోస్టర్లు, బ్యానర్ల ఏర్పాటులో ఎంసీసీ నియమాలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలన్నారు. అక్రమంగా డబ్బులు, మద్యం తరలింపుపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. చెక్ పోస్టుల వద్ద సీసీ టీవీలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఏఎస్పీ రవీందర్ రెడ్డి, డీటీసీ ఏఎస్పీ మురళీధర్, డీఎస్పీలు నర్సింలు, కరుణసాగర్ రెడ్డి, శేఖర్ గౌడ్, విజయ్ కుమార్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో మీడియా పాయింట్

వికారాబాద్ అర్బన్: ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు కలెక్టరేట్‌లో మీడియా పాయింట్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం మీడియా సెంటర్‌ను, మానిటరింగ్ కమిటీ సెల్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంసీఎంసీ కమిటీ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం జరుగుతుందన్నారు. అనుమతి లేకుండా ప్రకటనలు ఇస్తే వాటిని అభ్యర్థి ప్రచార ఖర్చు కింద జమ చేస్తామని తెలిపారు. సోషల్ మీడియాలో అభ్యర్థుల ప్రకటనలను కూడా పరిశీలిస్తామన్నారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న అన్ని రకాల ప్రకటనలకు ఎంసీఎంసీ ఆమోదం తెలపాలని ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను, 1950 కాల్ సెంటర్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, డీఆర్ డీఓ కృష్ణన్, డీవైఎస్ఓ హనుమంతరావు, ఎన్నికల నోడల్ అధికారులు ఉపేందర్, శ్రీనివాసరావు, సుధారాణి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- గురుకుల విద్యాలయాల సంస్థ అడిషనల్ సెక్రటరీ పార్వతీదేవి

మొయినాబాద్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ అడిషనల్ సెక్రటరీ పార్వతీదేవి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు గురుకుల పాఠశాల ఆవరణలో నాలుగు రోజుల పాటు నిర్వహించే గురుకులాల జోనల్ స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 11 బాలుర గురుకులాల నుంచి 955 మంది విద్యార్థులు పాల్గొంటున్న క్రీడా పోటీలను ఆమె బెలూన్లు ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రీడా స్ఫూర్తిని నింపేందుకు గురుకులాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గురుకులాల ప్రాంతీయ సమన్వయాధికారి శారద, భాస్కర ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంచందర్‌రావు, ప్రాంతీయ క్రీడాధికారి ఉదయభాస్కర్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ ఆదిబాబు, అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించండి

- డీసీసీ అధ్యక్షుడి సతీమణి ఉమా రామ్మోహన్‌రెడ్డి
- గుండాల గ్రామంలో ఆరు గ్యారంటీలపై ప్రచారం

దోమ: బీఆర్ఎస్ పార్టీపై ప్రజల్లో నమ్మకం పోయిందని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడి సతీమణి ఉమా రామ్మోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని గుండాల గ్రామంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలపై ఇంటింట ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు అమలు కావడం ఖాయమన్నారు. మహిళా సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రామగోవర్ధన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రమేశ్‌గౌడ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గుండాల గ్రామంలో ప్రచారం చేస్తున్న ఉమారెడ్డి

పేదల జీవితాల్లో వెలుగులే లక్ష్యం

కుల్కచర్ల: నిరుపేద, బడుగుబలహీన వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కుస్మసముద్రం, ముజాహిద్‌పూర్ గ్రామాలకు చెందిన ఆయా పార్టీల కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో పేదలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఆ నమ్మకంతోనే కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు సిద్ధమయ్యారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మండల అధ్యక్షులు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్య, నాయకులు ఆనందం, బాబు, కృష్ణయ్య, శివరాములు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఆర్‌సీ ఇప్పిస్తానని పిలిచి..

అన్నను హతమార్చిన తమ్ముడు

- తన వాటా భూ విక్రయానికి అడ్డుగా ఉన్నాడని ఘాతుకం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కరుణ సాగర్‌రెడ్డి

పరిగి: తన వాటా భూమిని విక్రయించడానికి అడ్డుగా ఉన్నాడని భావించిన తమ్ముడు అన్నను పథకం ప్రకారం హతమార్చాడు. ఈ సంఘటన పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం పరిగి సీఐ కార్యాలయంలో డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి వెల్లడించారు. బొంరాస్‌పేట్ మండలం చౌదర్‌పల్లికి చెందిన సాయన్నకు ఏడుగురు కొడుకులు. తల్లిదండ్రుల పేరిట 11 ఎకరాల భూమి ఉంది. జోగు రాములు అందరి కంటే చిన్నవాడు. గతంలో బాలికను వివాహం చేసుకోవడంతో అతనిపై బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బాలికను ఎత్తుకెళ్లడానికి ఉపయోగించిన బైక్‌ను సీజ్ చేసి జైలుకు పంపారు. ఆ బైక్ అన్న చిన్న నర్సింలుది కావడంతో జైలు నుంచి వచ్చిన తమ్ముడు రాములిని నిత్యం బైక్ కావాలని అడిగేవాడు. దీంతో కోర్టులో పిటీషన్ వేసి బైక్ తెచ్చి అన్నకు ఇచ్చాడు. కానీ ఆర్‌సీ ఇవ్వలేదు. కోర్టు కేసు రాజీ చేసుకోవడం తోపాటు అప్పులు తీర్చుకోవాలని భావించిన రాములు తన వాటా భూమి విక్రయించాలని అనుకున్నాడు. ఐదుగురు అన్నలు ఒప్పుకున్నారు. నర్సింహులు మాత్రం ఒప్పుకోలేదు. దీంతో రాములు అన్నను హతమార్చాలని భావించాడు. ఇందుకోసం పథకం వేశాడు. ఈ నెల 10న అన్నకు ఫోన్ చేశాడు. బైక్ ఆర్‌సీ ఇవ్వడానికి అధికారులు ఒప్పుకున్నారని, నీ సంతకం కావాలని వికారాబాద్‌కు తీసుకెళ్లాడు. అక్కడ సార్ లేడు తుంకులగడ్డ సమీపంలోని ఫాంహౌస్‌లో ఉన్నాడని చెప్పి లక్నాపూర్ ప్రాజెక్టు దగ్గరకు తీసుకొచ్చాడు. అక్కడ బైక్ ఆపి తన వెంట తెచ్చుకున్న సుత్తితో అన్న తలపై బలంగా మోదాడు. అనంతరం బండ రాయితో ముఖంపై కొట్టాడు. అన్న నర్సింహులు చనిపోయాడని నిర్ధారించుకొని ప్యాంట్ జేబులో ఉన్న సెల్‌ఫోన్, రూ. 300 తీసుకుని షాద్‌నగర్‌కు వెళ్లాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారించారు. రాములు నేరం ఒప్పుకోవడంతో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ వెంకట రామయ్య, ఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు.